క్లుప్తంగా

ఘనంగా మొలకల పౌర్ణమి



మొలకలతో ఉన్న కుంపట్లను ఆలయాలకు తీసుకెళ్తున్న మహిళలు

పుట్లూరు: వర్షాలు సకాలంలో కురిసి పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ గురువారం మండలంలోని బాలాపురం గ్రామంలో మొలకల పౌర్ణమి ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి సేకరించిన విత్తనాలను మట్టి కుంపట్లలో వేసి ఏడు రోజుల పాటు మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు మొలకలతో ఉన్న కుంపట్లను తలపై ఉంచుకుని ఆలయాల్లో పూజలు చేసి ప్రతి ఆలయం వద్ద మొలకలు ఉన్న కుంపట్లను ఉంచారు. మొలకల పౌర్ణమి చేయడం వల్ల సకాలంలో వర్షాలు కురవడంతో పాటు సమృద్ధిగా పంటలు పడుతాయని గ్రామస్తులు తెలిపారు.

స్టాటర్, కేబుల్ చోరీ

గార్లదిన్నె: మండలంలోని బూదేడులో ఓ రైతుకు చెందిన స్టాటర్, కేబుల్ దుండగులు చోరీ చేశారు. గురువారం బాధిత రైతు రామాంజనేయులు మాట్లాడుతూ గ్రామ సమీపంలో ఆరు ఎకరాల్లో చీనీ చెట్లు సాగు చేశానన్నాడు. బుధవారం గుర్తుతెలియని వ్యక్తులు స్టాటర్, కేబుల్ చోరీ చేశారన్నాడు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

సజావుగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీకాంత్ చౌదరి

గుంతకల్లు రూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీకాంత్ చౌదరి, ఎంపీపీ బీవీ మాధవి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. కాగా ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఎటువంటి చర్చలకు తావు లేకుండా సమావేశాన్ని ముగించారు. ప్రతి మూడు నెలలకోసారి సమావేశం నిర్వహించాల్సి ఉంది. నిబంధనల మేరకు సమావేశం నిర్వహించామని ఎంపీడీఓ తెలిపారు.

బుద్ధ జయంతి వేడుకలు

తాడిపత్రి అర్బన్: స్థానిక టీచర్స్‌కాలనీలోని పెన్షనర్ భవనంలో గురువారం బుద్ధుని జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యప్రసాద్ ఆధ్వర్యంలో బుద్ధుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు ఆదినారాయణస్వామి, సత్యనారాయణ, నరసింహులు, కేశవరెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అన్నమయ్య జయంతి



అన్నమయ్య చిత్రపటానికి పూలమాలలేసిన దృశ్యం

తాడిపత్రి అర్బన్: తొలి తెలుగు వాగ్గేయకారుడు అన్నమాచార్యుల జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం స్థానిక స్నేహభారతి సంగీత శిక్షణాలయంలో నిర్వాహకులు మహేష్‌స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో అన్నమయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా పలువురు కళాకారులు ఆలపించిన సంకీర్తనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో శివప్రసాద్, నాయుడు, నాగ రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

మండలానికి చేరుకున్న ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు



ఎమ్మార్సీలో భద్రపరచిన పాఠ్యపుస్తకాలు

తాడిపత్రిటౌన్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించిన పాఠ్యపుస్తకాలు పట్టణంలోని ఎమ్మార్సీ కార్యాలయానికి చేరాయి. 8, 9, 10 తరగతులకు సంబంధించి దాదాపు 34 వేల పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు వచ్చాయని ఎంఈఓ నాగరాజు తెలిపారు. 1 నుంచి 7 తరగతులకు చెందిన పుస్తకాలు మరో రెండు రోజుల్లో వస్తాయన్నారు. విద్యార్థులకు సకాలంలో పుస్తకాలు అందజేస్తామన్నారు.

'పీహెచ్‌సీ' సేవలు భేష్



తిలక్‌నగర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



మహిళకు బీపీ చెక్ చేస్తున్న నర్సు

- నియోజకవర్గంలో 5 యూపీహెచ్‌సీలు
- ప్రతి సెంటర్‌లో రోజూ 100 మందికి పైగా సేవలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

గుంతకల్లు: నియోజకవర్గంలోని డాక్టర్ వైస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు మెరుగైన ఆరోగ్య సేవలు అందిస్తున్నారు. ఈ కేంద్రాల్లో అన్ని రకాల జబ్బులకు నిర్ధారణ పరీక్షలతోపాటు అన్ని రకాల మందులు అందుబాటు ఉన్నాయి. దాదాపు 40 వేలు జనాభాకు ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నియోజకవర్గంలో ఆరు ఏర్పాటు చేశారు. దీంతో పట్టణంలోని అన్ని ఏరియాల్లో ఆస్పత్రి సేవలు అందుబాటులో ఉన్నాయి, గర్భిణులు, బాలింతలు, శిశువులతో పాటు అన్ని రకాల రోగులు అందుతున్న సేవలపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆకట్టుకుంటున్న హెల్త్ సెంటర్లు

నియోజకవర్గంలోని గుంతకల్లు, గుత్తి అర్బన్ ఏరియాల్లో వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ సరికొత్త భవనాలు ఆకట్టుకుంటున్నాయి. ఒక్కో సెంటర్‌ను దాదాపు రూ.80 లక్షల నుంచి 85 లక్షల వ్యయంతో నిర్మించారు. గుంతకల్లులోని తిలక్‌నగర్, సత్యనారాయణపేట, భాగ్యనగర్, అంబేడ్కర్ నగర్‌లో గుత్తిలోని జంగాల కాలనీ, చెట్నేపల్లిలో హెల్త్ సెంటర్లు అందుబాటులోకి వచ్చాయి. వీటితోపాటు లక్షలాది రూపాయలతో వ్యాధి నిర్ధారణ పరికరాలు సమకూర్చారు. దీంతో అన్ని రకాల జబ్బులను నిర్ధారించడమే కాకుండా సమగ్ర సేవలను అందిస్తున్నారు. ప్రతి సెంటర్‌లో డాక్టర్, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఫార్మాసిస్టు, ల్యాబ్ టెక్నిషియన్, డేటా ఎంట్రీ ఆపరేటర్‌తో పాటు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. దీంతో గర్భిణులు, బాలింతలకు వైద్యపరీక్షలు, చిన్నారులకు వ్యాక్సిన్ వంటి సేవలు సకాలంలో అందుతున్నాయి. మధుమేహం ఉన్న వారికి కూడా వారంలో ఒక రోజు ఉదయం నుంచే సేవలు అందిస్తున్నారు. ఇలా ప్రతి జబ్బుకూ మెరుగైన వైద్యం అందుతుంది. అలాగే అన్ని రకాల జబ్బులకు మందులు అందజేయడంతో పాటు రక్త పరీక్షలు కూడా నిర్వహిస్తున్నారు.

వైద్య సేవలు బాగున్నాయి



గతంలో ప్రభుత్వాస్పత్రికి వెళ్తే చిన్న చిన్న జబ్బులకు మందులు ఇచ్చేవారు కాదు. అయితే మా ఇంటి సమీపంలోనే ఆస్పత్రి అందుబాటులోకి రావడంతో ఆరోగ్య పరమైన సమస్యలు వస్తే ఇక్కడే చూపించుకుంటున్నాం. అంతేకాకుండా బీపీ, ఇతర రక్తపరీక్షలు కూడ ఇక్కడే చేస్తున్నారు. ముఖ్యంగా డాక్టర్లు, నర్సులు బాగా చూసుకుంటున్నారు. ఆస్పత్రిలో వైద్య సేవలు బాగున్నాయి. –రాధిక, తిలక్‌నగర్, గుంతకల్లు

నేటి నుంచి విత్తన వేరుశనగ పంపిణీ

గుంతకల్లు రూరల్/బుక్కరాయసముద్రం: గుంతకల్లు మండల వ్యాప్తంగా అన్ని రైతు భరోసా కేంద్రాల్లోనూ శుక్రవారం నుంచి విత్తన వేరుశనగ పంపిణీ కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు ఏఓ స్వాతి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో ఇప్పటివరకూ 1,798 మంది రైతులు విత్తన వేరుశనగ కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. అలాగే బుక్కరాయసముద్రం మండలంలో 1,893 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఏఓ శ్యాంసుందర్‌రెడ్డి రెడ్డి తెలిపారు.

అమ్మవారిని తాకిన సూర్య కిరణాలు



పామిడి మహాయోగ దత్త పీఠంలో అమ్మవారిని తాకిన సూర్య కిరణాలు

పామిడి: పట్టణంలోని మహాయోగ దత్త పీఠంలో గురువారం లలితా మాత విగ్రహాన్ని సూర్య కిరణాలు తాకాయి. దీంతో ఆ పీఠం పీఠాధిపతి సురేంద్ర మహరాజ్ ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. లలిత సహస్ర నామ పారాయణం గావించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తరించారు.

సమతుల ఆహారం తీసుకోవాలి

గుత్తి: బాలింతలు, గర్భిణులు, కిశోర బాలికలు సమతుల ఆహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరి సూచించారు. పట్టణంలోని ఎస్సీ కాలనీ (కర్రెమ్మ అంగన్‌వాడీ కేంద్రం)లో గురువారం గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రోటీన్, ఐరన్ అధికంగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్య భేషుగ్గా ఉంటుందన్నారు. ఐరన్ అధికంగా ఉండే సీ విటమిన్ పదార్థాలతో పాటు మాంసాహారం, శాఖాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా తదితరులు పాల్గొన్నారు.

మాన్యం భూముల పరిశీలన



జక్కలచెరువు గ్రామ సమీపంలోని భూములను పరిశీలిస్తున్న ఈఓ రాణి

గుత్తి రూరల్: మండలంలోని జక్కలచెరువు గ్రామ శివారులో ఉన్న తొండపాడు బొలికొండ రంగనాథ స్వామి ఆలయ మాన్యం భూములను ఈఓ రాణి గురువారం పరిశీలించారు. గ్రామ శివారులోని సర్వే నంబర్ 643లో 8.04 ఎకరాలను కౌలుకు ఈ నెల 16న వేలం నిర్వహించాలని దేవదాయ శాఖ అధికారులు నిర్ణయించారు. అయితే భూములు కౌలుకు తీసుకునేందుకు రైతులు ముందుకు రాకపోవడంతో వేలం రెండు సార్లు వాయిదా పడింది. దీంతో ఈఓ మాన్యం భూములను పరిశీలించారు. భూములు సాగుకు అనువుగా ఉన్నాయా? లేదా అని రైతులతో ఆరా తీశారు. భూములు కౌలుకు వేలంలో పాల్గొనాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో గ్రూప్ టెంపుల్ మేనేజర్ నాగేంద్రుడు, ఆలయ సిబ్బంది రామకృష్ణ, బాలుమోహన్, రైతులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు భంగం కలిగించొద్దు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ నాగార్జునరెడ్డి



దిమ్మగుడిలో మాట్లాడుతున్న అధికారులు

పెద్దవడుగూరు: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ శేషారామ్‌సింగ్, ఎంపీడీఓ గోపీకృష్ణ, ఎస్‌ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. గురువారం మండలంలోని దిమ్మగుడిలో ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఇటీవల ఎన్నికల సమయంలో గ్రామంలో గొడవ జరిగిందని, అలాంటివి తీవ్రంగా పరిగణలోకి తీసుకుంటామన్నారు. ఏమైనా సమస్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకరావాలన్నారు. ఎన్నికల కోడ్ ఎవరైనా ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. గ్రామాల్లో ప్రజలందరూ కలసిమెలసి, ప్రశాంత వాతావరణంలో జీవించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

వివాదాలకు దూరంగా ఉండాలి

యాడికి: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ వివాదాలకు దూరంగా ఉండాలని సీఐ నాగార్జున రెడ్డి సూచించారు. స్థానిక పోలీస్టేషన్‌లో గురువారం మండలంలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లు వివాదాలకు దూరంగా ఉంటూ, సత్ ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుంటామని హెచ్చరించారు. సత్ప్రవర్తన కలిగి ఉంటే కొంత కాలానికి రౌడీషీట్ తొలగిస్తామన్నారు.

ఎన్నికల ఫలితాల రోజు అల్లర్లకు పాల్పడొద్దు

గుత్తి రూరల్: సార్వత్రిక ఎన్నికల ఫలితాల రోజు ఏ పార్టీ గెలిచినా ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని, అలా కాకుండా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ వెంకట్రామిరెడ్డి, ఎస్‌ఐ నబీరసూల్, తహసీల్దార్ భారతి, ఎంపీడీఓ శ్రీనివాసులు హెచ్చరించారు. మండలంలోని అబ్బేదొడ్డి, మాముడూరు గ్రామాల్లో గురువారం వారు పర్యటించి గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ, తహసీల్దార్ మాట్లాడుతూ జూన్ 4న ఫలితాలు వెలువడనున్నాయని ఎవరూ గెలిచినా, ఓడినా సామరస్యంగా ఉండాలన్నారు. ర్యాలీలు చేయడం, బాణాసంచా పేల్చడం నిషేధమని, ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. గ్రామాల్లో అందరు కలసి, మెలసి ఉండాలని సూచించారు. అనంతరం గ్రామాల్లో పోలీసులతో కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ శివాజీరెడ్డి, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

బాణా సంచా పేల్చడం, ర్యాలీలు నిర్వహించొద్దు

పుట్లూరు: ఎన్నికల ఫలితాల అనంతరం విజయోత్సవాల పేరుతో బాణా సంచా పేల్చడం, ర్యాలీలు నిర్వహించడం చేస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ సుబ్రమణ్యం హెచ్చరించారు. శుక్రవారం ఆయన మండలంలోని కోమటికుంట్ల గ్రామంలో పర్యటించారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నందున గుంపులుగా ఉండరాదన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ హేమాద్రి, సిబ్బంది పాల్గొన్నారు.

ఓబుళాపురం, దోశలేడు గ్రామాల్లో నాకాబందీ

పుట్లూరు: మండలంలోని ఓబుళాపురం, దోశలేడు గ్రామాల్లో పోలీసులు శుక్రవారం నాకాబందీ నిర్వహించారు. గ్రామంలోని వివాదాస్పద వ్యక్తుల ఇళ్లలో సీఐ సుబ్రమణ్యం, ఎస్‌ఐ హేమాద్రి ఆధ్వర్యంలో సిబ్బంది సోదాలు నిర్వహించారు. ఘర్షణలకు దూరంగా ఉండాలని వారు సూచించారు.

ముగిసిన వాసవీ జయంతి ఉత్సవాలు



గుంతకల్లులో గాయత్రీ సహిత కన్యకాపమేశ్వరి హోమం నిర్వహిస్తున్న దృశ్యం



యాడికి అమ్మవారిశాలలో సత్యనారాయణ వ్రతం చేస్తున్న దృశ్యం

గుంతకల్లు: పట్టణంలోని కన్యకాపరమేశ్వరదేవి ఆలయంలో జరుగుతున్న వాసవీ జయంతి ఉత్సవాలు గురువారం ముగిశాయి. చివరి రోజు వాసవీదేవి మూలవిరాట్‌ను బంగారం చీర, విశేషా పుష్పాలతో ముస్తాబు చేశారు. తొలుత విష్ణు సహస్ర నామ పారయణం గావించారు. దాదపు 300 మంది మహిళలచే కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వేదపండితులు, అర్చకుల ఆధ్వర్యంలో గాయత్రీ సహిత కన్యకాపరమేశ్వరి హోమం చేపట్టారు. తొలిసారిగా అమ్మవారికి బంగారు అక్షయ పాత్రలో నివేదన సమర్పించిన అనంతరం భక్తులకు తీర్థాన్ని అందజేశారు. సాయంత్రం వాసవీ దేవి ఉత్సవ విగ్రహాన్ని గ్రామోత్సవం నిర్వహంచారు. అనంతరం వాసవీ కంకణ విసర్జనతో ఉత్సవాలకు ముగింపు పలికారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు గోపా జగదీష్, కందూరి కృపాకర్, కోశధికారి మేడా వెంకటేశ్వర్లు, 1,500 మంది పైగా ఆర్యవైశ్యలు ఉత్సవాల్లో పాల్గొన్నారు.

వైశాఖ పౌర్ణమి వేడుకలు

యాడికి: మండల కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో గురువారం వైశాఖ పౌర్ణమి వేడుకలను ఆర్యవైశ్య సంఘం సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రతేక అలంకరణ, పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు,ఆర్య వైశ్యులు సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. మహిళలు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు.

ఆపరేషన్‌కు ఆర్థికసాయం అందజేత



షెక్షావలి కుటుంబానికి రూ.75 వేలు అందిస్తున్న దాతలు

పామిడి: గర్భిణీ ఆపరేషకు నగదు అందజేసి దాతృత్వాన్ని చాటారు. వివరాలు.. పట్టణంలోని షెక్షావలి భార్య షైనాజ్ ఆరునెలల గర్భిణి. ఇటీవల ఆమె మెదడు సంబంధిత వ్యాధికి గురై ప్రాణాపాయ స్థితికి చేరింది. వైద్యుల సలహా మేరకు బాధిత కుటుంబం ఆమెను బెంగుళూరులోని సెయింట్ జాన్స్ ఆస్పత్రిలో చేర్చారు. ఆపరేషన్‌కు దాదాపు రూ.3 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితి షెక్షావలిది. అంతడబ్బు పెట్టి ఆపరేషన్ చేయించలేక పామిడికి వెనుదిరిగి వచ్చారు. విషయం తెలుసుకున్న స్థానిక అభయ బ్లడ్ డోనర్స్ సంస్థ, వడ్డే రాముడు మిత్రబృందం మానవతాదృక్పథంతో స్పందించారు. వారు దాతల సహకారంతో పోగు చేసిన రూ.75వేలను షెక్షావలికి అందజేశారు. ఆపద సమయంలో ఆర్థికసాయం అందించిన సంస్థ సభ్యులు, వడ్డే రాముడు మిత్ర బృందానికి బాధిత కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది.

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని కొట్టాలపల్లి రోడ్డు సమీపాన ఉన్న ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ హర్జేనాయక్ గురువారం సూచించారు. పాఠశాలలో 3వ తరగతిలో 40 సీట్లు ఉన్నాయన్నారు. వీటిలో ఎస్టీ-32, ఎస్సీ-5, బీసీ-2, ఓసీ-1 సీటు ఉందన్నారు. అలాగే 4వ తరగతి నుంచి 9వ తరగతి వరకూ బ్యాక్‌లాగ్ ఖాళీ సీట్ల ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. 4వ తరగతిలో -35 సీట్లు, 5వ తరగతిలో-24, 6వ తరగతిలో-15, 7వ తరగతి-4, 8వ తరగతి-14, 9వ తరగతి-8 సీట్లు ఉన్నాయన్నారు. బ్యాక్‌లాగ్ సీట్లు ఎస్టీ విద్యార్థులతో మాత్రమే భర్తీ చేస్తామన్నారు. లాటరీ పద్ధతిలో ఎంపిక ఉంటుందన్నారు. వివరాలకు 9948100343 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

వ్యవసాయంపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త మాధవీలత

బుక్కరాయసముద్రం: విద్యార్థులకు చదువులతో పాటు వ్యవసాయంపై అవగాహన ఎంతో అవసరమని రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మాధవీలత అన్నారు. గురువారం మండలంలోని రేకులకుంటలో ఉన్న ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన స్థానాన్ని మహానంది వ్యవసాయ కళాశాల నుంచి అగ్రికల్చర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు సందర్శించారు. పరిశోధనా స్థానంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలతో పాటు వివిధ పంటల సాగు, తెగుళ్ల యాజమాన్య పద్ధతులు, మెట్ట వ్యవసాయం ప్రాముఖ్యతపై ఆమె వివరించారు. డాక్టర్ రమేష్‌బాబు, డాక్టర్ లక్ష్మణ్, డాక్టర్ ఉమాదేవి, డాక్టర్ కవిత, విద్యార్థులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



శింగనమల క్రాస్ వద్ద వాహన రికార్డులను పరిశీలిస్తున్న ఎస్‌ఐ చంద్రశేఖర్

శింగనమల: వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ చంద్రశేఖర్ సూచించారు. గురువారం సాయంత్రం శింగనమల క్రాస్‌లో వాహనాలు తనిఖీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది ధనుంజయ, ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం



గుత్తి: అలంకరణలో వేంకటేశ్వర స్వామి



శింగనమల: రామాలయంలో గొల్లకొండ వెంకటరమణ స్వామి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



పెద్దపప్పూరు: లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవ దృశ్యం

గుత్తి రూరల్: మండలంలోని కొత్తపేట గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారి పక్కనున్న లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులకు అర్చకులు ఉదయం నుంచి విఘ్నేశ్వరపూజ, పుణ్యహవాచనం, రక్షాబంధనం, పంచామృతాభిషేకం, తులసి పత్రి పూజ, హోమం తదితర పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. స్వామికి సమర్పించే పట్టు వస్త్రాలు, స్వామి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఊరేగించారు. స్వామికి మహిళలు ఒడి బియ్యం సమర్పించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యుడు నాగేపల్లి లక్ష్మయ్య, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా గొల్లకొండ వెంకటరమణ స్వామి కల్యాం

శింగనమల: మండల కేంద్రంలోని రామాలయంలో బుధవారం రాత్రి అర్చకులు గొల్లకొండ వేంకటరమణ స్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో ఆలయం బయట నిర్వహించడానికి పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంతో, రామాలయంలోనే కొద్ది మంది భక్తుల మధ్య కల్యాణోత్సవం చేపట్టారు. స్వామికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి దంపతులు పంపించారు. శుక్రవారం గ్రామంలో వెంకటరమణస్వామి రథోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

నారసింహుని కల్యాణోత్సవం

పెద్దపప్పూరు: వైశాఖ మాసం బుద్ధ పౌర్ణమి సందర్భంగా మండలంలోని తిమ్మన చెరువు కొండపై గురువారం వజ్రగిరి లక్ష్మీనరసింహ స్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. టీటీడీ అర్చకులు శ్రీదేవి, భూదేవి, నరసింహ స్వాములను వధూవరులుగా పట్టు వస్త్రాలతో ముస్తాబు చేసి కల్యాణం చేయించారు. పరిసర ప్రాంతాల నుంచే గాక దూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి కల్యాణ మహోత్సవాన్ని వీక్షించారు.

అశ్వర్థంలో నారాయణుడి కల్యాణం

మండలంలోని అశ్వర్థ నారాయణుడి క్షేత్రంలో పౌర్ణమి సందర్భంగా నారాయణ స్వామి కల్యాణోత్సవాన్ని ఆలయ ప్రధాన అర్చకులు బాల సుబ్రమణ్య శర్మ , సునీల్ కుమార్ శర్మ నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

నాణ్యమైన విత్తన వేరుశనగ అందజేయాలి

గుంతకల్లు: ఖరీఫ్‌లో సాగు చేసే రైతులకు మేలురకమైన విత్తన వేరుశనగ అందజేయడంతోపాటు 90 శాతం సబ్సిడీ ఇవ్వాలని ఏపీ జిల్లా రైతు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ బి.గోవిందు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో వేరుశనగతోపాటు కంది, పత్తి, ఇతర విత్తనాలు కూడా నాణ్యమైనవి ఇవ్వాలని, వీటికి 90 శాతం సబ్సిడీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకుడు ఉమర్‌బాషా, సీపీఐ నాయకుడు ఎస్ఎండీ గౌస్, ఏఐటీయూసీ నాయకుడు ఈశ్వరయ్య పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తాడిపత్రి డివిజన్
9912220722, 9010223701
9912220732, 9010588846